


వైసీపీ పాపం.. వీఆర్‌వోలకు శాపం

- వలంటీర్లతో గంపగుత్తగా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల దరఖాస్తులు
- రిజెక్ట్ అయిన వేలాది సర్టిఫికెట్లు
- సుమోటోగా విచారిస్తున్న సబ్‌కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా రిజెక్టెడ్ సర్టిఫికెట్లు ఎన్నో..?

మదనపల్లె టౌన్, ఆగస్టు 31: ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం కులగణన సర్వే చేసేందుకు మొదలుపెట్టిన ప్రక్రియ, వలంటీర్లతో ఇంటింటికీ సర్వే వెరసి కుల ధ్రువీకరణ పత్రాల కోసం చేసిన దరఖాస్తులు రిజెక్ట్ (తిరస్కరించబడ్డాయి) అయ్యాయి. వైసీపీ పాలకులు చేసిన కులగణన పాపం నేడు వీఆర్‌వోలకు శాపంగా మారనుంది. వేల సంఖ్యలో రిజెక్ట్ అయిన కుల ధ్రువీకరణ పత్రాలపై మదనపల్లె సబ్‌కలెక్టర్ సుమోటోగా స్వీకరించి వాటిపై నేరుగా గ్రామాల్లో పర్యటిస్తూ, సచివాలయాల్లో విచారిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని 30 మండలాల్లో ఎన్నికలకు ముందు కులధ్రువీకరణ చేసిన దరఖాస్తులు లక్షల సంఖ్యలో ఉండగా, అందులో రిజెక్ట్ అయిన దరఖాస్తులు సుమారు 60 వేలకు పైగా ఉండొచ్చని అంచనా. దీనిపై మిగిలిన సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు కూడా సుమోటోగా తీసుకుని విచారిస్తే గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరుతో పాటు వలంటీర్ల తప్పిదాలు వెలుగులోకి వస్తాయి.

జిల్లాలో 60 వేలకు పైగా రిజెక్టెడ్ సర్టిఫికెట్లు..?

ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఆగమేఘాలపై కులగణన సర్వే మొదలు పెట్టింది. దీనికోసం ఆయా మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో కులగణన సర్వే చేపట్టారు. దీనికోసం గ్రామ, పట్టణ సచివాలయాల సిబ్బందికి ఒక్కొక్కరికి 100 ఇళ్ల చొప్పున కేటాయించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణనపై సర్వే చేయాలి. కానీ ఇక్కడ సచివాలయాల సిబ్బంది, సర్వేకు వెళ్లకుండా వలంటీర్లపై ఆధారపడ్డారని సమాచారం. అంతేకాకుండా వలంటీర్లకు మొబైల్‌ఫోన్లు ఇచ్చి సచివాలయ సిబ్బంది లాగిన్‌లో సర్వే చేయించారు. అంతంత మాత్రమే పరిజ్ఞానం ఉన్న చాలామంది మొబైల్‌లో కుటుంబ యజమానుల వివరాలను తప్పుల తడకగా నమోదు చేశారు. ఇలా నమోదు చేసిన సర్వేలో ఏమైందో ఏమో కానీ ఈ వివరాలన్నీ వీఆర్‌వో లాగిన్‌కు కులధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసినట్లు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో కుటుంబ యజమాని పేర్లు లేకుండా, అసలు కులమే తప్పులుగా, వెరిఫికేషన్ సర్టిఫికెట్లు లేకుండా మొబైల్‌లో దరఖాస్తులు వచ్చేశాయి. ప్రతి ఇంటి నుంచి ఈ విధంగా సర్వే పేరుతో దరఖాస్తులు రావడంతో జిల్లావ్యాప్తంగా లక్షల సంఖ్యలో కులధ్రువీకరణ దరఖాస్తులు వీఆర్‌వోల లాగిన్‌కు వచ్చాయి.

తప్పుల దరఖాస్తులు వేలల్లో రిజెక్టెడ్

కులధ్రువీకరణ పత్రాల కోసం వీఆర్‌వోల లాగిన్‌కు వచ్చిన దరఖాస్తులను వీఆర్‌లో క్షేత్రస్థాయిలో వెళ్లి విచారించాలి. ఎన్నికలకు ముందు పోలింగ్‌స్టేషన్‌ల ఏర్పాటు, ఓటరు జాబితా సిద్ధం చేయడంతో పాటు, రెవెన్యూ సేవల్లో వీఆర్‌వోలు బిజీ అయిపోయారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో కొంతమంది విచారించి కుల ధ్రువీకరణ పత్రాల్లో ఓసీ తప్ప మిగిలిన వాటిలో 25 శాతం రిజెక్ట్ చేసేశారు. అందులో దరఖాస్తుదారుడి తండ్రి పేరు లేకపోవడం, కొందరు చనిపోయి ఉండటం, వెరిఫికేషన్ సర్టిఫికెట్లు (విద్యార్థి టీసీ, కుల సంఘాల రెకమండేషన్, తండ్రి కుల సర్టిఫికెట్)లు లేకపోవడం, డోర్‌నెంబర్లు తప్పుగా నమోదు చేయడం, కొందరు వలసవెళ్లి అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో వీఆర్‌వోలు కులధ్రువీకరణ పత్రాలను రిజెక్ట్ చేశారు. అందులోను దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే వీఆర్‌వోలు విచారించి బియాండ్ సమయంలోకి రాకముందే ధ్రువీకరణ చేయడం లేకుంటే రిజెక్ట్ చేయడం ముగించాలి. ఇందులో భాగంగా చాలామంది వీఆర్‌వోలు కులధ్రువీకరణ పత్రాలను రిజెక్ట్ చేశారు.

22,848 దరఖాస్తులు తిరస్కరణ

మదనపల్లె రెవిన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నెలలో వీఆర్‌వోల లాగిన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో 22,848 తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో అత్యధికంగా మదనపల్లె పట్టణం, మండలంలో 6652 రిజెక్ట్ కాగా, బి.కొత్తకోట పట్టణం, మండలంలో 3638 రిజెక్ట్ అయ్యాయి. కలికిరి మండలంలో 2806, కురబలకోటలో 2203, ములకలచెరువులో 2133, నిమ్మనపల్లెలో 1388, రామసముద్రంలో 1049, పెద్దమండ్యంలో 1001, పీటీఎంలో 1000, వాల్మీకిపురంలో 498, తంబళ్లపల్లెలో 480 దరఖాస్తులు కలిపి 22,848 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

సుమోటోగా విచారిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో గంపగుత్తగా కులధ్రువీకరణ దరఖాస్తులు వీఆర్‌వోల లాగిన్‌కు రావడం, అందులో 22,848 దరఖాస్తులు తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నెల రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వీటిపై దృష్టి పెట్టారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల వివరాలను సుమోటోగా తీసుకుని మండలాల వారీగా విచారణ మొదలుపెట్టారు. తొలుత బి.కొత్తకోట, కలికిరి మండలం తరువాత మదనపల్లె మండలాల్లో గ్రామాలకు వెళ్లి స్వయంగా దరఖాస్తుదారులతో మాట్లాడుతున్నారు. దీంతో పాటు గ్రామ సచివాలయాలకు వెళ్లి ఎవరు దరఖాస్తు చేశారు..? ఎక్కడి నుంచి లాగిన్ అయ్యింది తదితర వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారు. తదితర అంశాలను వీఆర్‌వోలను ప్రశ్నించారు.

బాధ్యులుగా మారుతున్న వీఆర్‌వోలు

నిత్యం రెవెన్యూ సేవల్లో ఉంటున్న వీఆర్‌వోలకు ఇటీవల అదనంగా ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ విధులు వచ్చిపడ్డాయి. అంతేకాకుండా వ్యవసాయశాఖ అసిస్టెంట్లతో కలసి క్రాప్ ఇన్సూరెన్స్, హౌసింగ్, ఏఎస్‌వో సర్వే అదనంగా వచ్చిపడటంతో వీఆర్‌వోలు బిజీ అయిపోయారు. ఇప్పుడు దీనికి అదనంగా రిజెక్ట్ అయిన కులధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను రీవెరిఫికేషన్ చేసే పనులు వచ్చి పడ్డాయి. వీటిలో ఏ అంశమైనా తప్పులు జరిగానా వీఆర్‌వోలు బాధ్యులుగా మారనున్నారు. మొత్తానికి వైసీపీ పాలకులు చేసిన కులగణన పాపం నేడు వీఆర్‌వోలకు శాపంగా మారనుంది. జిల్లాలో రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్‌లలో కూడా ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్న కులధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు వేలల్లో రిజెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పీలేరులో ఆర్డీవో రంగస్వామి వీటిపై విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. మిగిలిన మండలాల్లో కూడా ఉన్నతాధికారులు ప్రయత్నం చేస్తే రిజెక్ట్ అయిన దరఖాస్తులు, అందులో తప్పిదాలు ఎక్కడో బయటపడనున్నాయి.



మదనపల్లె మండలంలో కుల ధ్రువీకరణ దరఖాస్తుల తిరస్కరణపై విచారిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ (ఫైల్)

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్



పోలీసైతే ఏంరా.. ట్రాక్టర్‌తో తొక్కించేస్తాం

- ములకలచెరువులో బరి తెగించిన ఇసుకాసురులు
- హోంగార్డుపై దాడి.. ఏఎస్ఐను పక్కకు నెట్టేసిన వైనం
- హోంగార్డుకు గాయాలు.. కేసు నమోదు.. నిందితుల అరెస్టు



ఏఎస్ఐ భాస్కర్‌నాయక్, హోంగార్డు సాంబ

ములకలచెరువు, ఆగస్టు 31: నువ్వు పోలీసైతే ఏం రా కొడకా... మా ట్రాక్టర్‌కు అడ్డొస్తే తొక్కిచేస్తాం... ఎవరనుకుంటున్నావంటూ ఇసుకాసురులు రెచ్చిపోయారు. ములకలచెరువులో ఇసుకాసురులు బరి తెగించి పోలీసుల మీదే దాడికి తెగబడ్డారు. ఓ హోంగార్డుపై దాడి చేశారు. అడ్డొచ్చిన ఏఎస్ఐను పక్కకు నెట్టేశారు. ఈ ఘటనలో హోంగార్డుకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక పాలసీ అమలయ్యే వరకు స్థానికంగా ఇసుకను తోలకూడదని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండలంలో ఇసుక రవాణా ఎక్కడా జరగడం లేదు. ఇదే అదునుగా భావించి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బిసినివారిపల్లె నుంచి ఇసుకాసురులు రాత్రి వేళల్లో సరిహద్దులో ఉన్న ములకలచెరువు మండలానికి ఇసుకను ట్రాక్టర్లతో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ సమీపంలోని బిసినివారిపల్లె నుంచి ఓ ట్రాక్టర్ ఇసుకను తీసుకుని మారుమూల మార్గం నుంచి ములకలచెరువు మండలం సోంపల్లెకు వచ్చింది. విధుల్లో భాగంగా అక్కడికి వెళ్లిన ఏఎస్ఐ భాస్కర్‌నాయక్, హోంగార్డు సాంబ ఇసుక ట్రాక్టర్‌కు నెంబర్ ప్లేటు లేకపోవడం గమనించారు. దీంతో ఇసుకను ఎక్కడి నుంచి తోలుతున్నారని, ట్రాక్టర్ రికార్డులు, ఇసుక తోలేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. రికార్డులు, అనుమతి లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకురావాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లేందుకు ఇసుక ట్రాక్టర్ వెంట పోలీసులు వచ్చారు. విషయాన్ని డ్రైవర్ జనార్ధన్ ట్రాక్టర్ ఓనర్ శివకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. ఈ క్రమంలో ఇసుక ట్రాక్టర్ తంబళ్లపల్లె-ములకలచెరువు రోడ్డులోని ములకలచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బాలసముద్రానికి చెందిన ట్రాక్టర్ యజమాని, టీడీపీ కార్యకర్త శివ అక్కడికి చేరుకుని పోలీసుల మీద తిరగబడ్డాడు. నా ట్రాక్టర్‌నే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తారా అని రెచ్చిపోయాడు. అంతటితో ఆగకుండా పోలీసులైతే ఏంటి అడ్డొస్తే ట్రాక్టర్‌తో తొక్కించేస్తాం అని హోంగార్డు సాంబశివ మీద దాడికి పాల్పడ్డాడు. అలాగే ఏఎస్ఐ భాస్కర్‌నాయక్‌ను పక్కకు తోసేశాడు. ఈ దాడిలో హోంగార్డుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ గాయత్రి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా అక్కడి నుంచి ట్రాక్టర్ యజమాని శివ పరారయ్యాడు. ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై రెండు కేసులు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డ ట్రాక్టర్ ఓనర్ పి.శివ, ఎలాంటి అనుమతులు, రికార్డులు లేకుండా ఇసుకను తీసుకొస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ జనార్ధన్‌పై వేర్వేరు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఏఎస్ఐ భాస్కర్‌నాయక్, హోంగార్డు సాంబశివ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

కన్నులపండువగా అంజన్నకు గ్రామోత్సవం

చక్రాయపేట, ఆగస్టు 31: గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాసోత్సవాల సందర్భంగా చివరి శనివారం అంజన్న గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కేరళ, పత్తిపాడు వాయిద్యకారులు దాదాపు 80 మంది మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. వర్షం కారణంగా పాపాఘ్ని నదిలో కాకుండా టీటీడీ ఏర్పాటుచేసిన కళాక్షేత్రంలో ఆస్థానం నిర్వహించారు. ఈ మెరవణికి ఎన్నడూలేని విధంగా భక్తులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కేసరి, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రస్తుత చైర్మన్ కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా ముగిసింది.

కిటకిటలాడిన గండి క్షేత్రం

చివరి శ్రావణ శనివారం కావడంతో గండిక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తుఫాన్ కారణంగా వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు గండికి భారీగావచ్చారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. పాపాఘ్నిలో భక్తులు కోలాహలంగా కనిపించారు. దాదాపు 25వేల లడ్లు, 10వేల పులిహోర ప్యాకెట్లు భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, రంగారావులు జాగ్రత్తలు తీసుకున్నారు.

అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నదానం చేశారు. వీరితో పాటు ఇందుకూరు నాగార్జున రెడ్డి, బిస్మల్లాబాద్ రామాంజులరెడ్డి, గోవిందమాల ఆధ్వర్యంలో దాదాపు 20వేల మందికి అన్నదానం చేశారు. చివరి శనివారం దాదాపు 70వేల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా.



గండి క్షేత్రంలో అంజన్న గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పులివెందులకు చేరుకున్న జగన్



పులివెందుల, ఆగస్టు 31: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం రాత్రి పులివెందులకు చేరుకున్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శనివారం కడపకు వచ్చారు. అక్కడ నుంచి వల్లూరు, పెండ్లిమర్రి మీదుగా రాత్రి 8.50గంటల ప్రాంతంలో పులివెందులలోని తన ఇంటికి చేరుకున్నారు. వైఎస్ వర్ధంతిని పురస్కరించుకుని జగన్ జిల్లాలో మూడు రోజుల పర్యటనకు వచ్చారు. ఆదివారం పులివెందులలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆదివారం అందుబాటులో ఉంటారని వైసీపీ వర్గాలు వెల్లడించాయి. 2వ తేదీ సోమవారం ఇడుపులపాయకు వెళ్లి వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఆయన తిరిగి తాడేపల్లెకు వెళ్లనున్నారు.

నేడు కడప జిల్లాకు వైఎస్ షర్మిలారెడ్డి

కడప(కలెక్టరేట్), ఆగస్టు 31:. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదివారం కడప జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్యాలయానికి సమాచారం అందింది. ఆమె ఆదివారం సాయంత్రం 4 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గానా బయలుదేరి ఇడుపులపాయ ఎస్టేట్‌కు వెళతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2వ తేదీ సోమవరం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ ఘాట్‌లో తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులు అర్పిస్తారు. అనంతరం రెండురోజుల పాటు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మధు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ పారా లీగ్ క్రికెట్ పోటీలకు శివకోటి

- సెప్టెంబరులో కోయంబత్తూరులో జరగనున్న పోటీలు



నందలూరు, ఆగస్టు 31: కోయంబత్తూరు సర్వనంపట్టి మైదానంలో సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో జరిగే భారత పారా క్రికెట్ లీగ్‌కు ఆంధ్ర రాష్ట్రం నుంచి శివకోటి ఎంపికైనట్లు బోర్డు ఆఫ్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్ నుంచి పిలుపువచ్చింది. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ కోయంబత్తూరు గెలాక్సీ వారి ఆధ్వర్యంలో జాతీయస్థాయి పారా క్రికెట్ లీగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు భారత జట్టు వైస్ కెప్టెన్‌గా శివకోటి ఎంపికయ్యారు. అద్భుతమైన ప్రదర్శన కనబరచి మనదేశానికి, రాష్ట్రానికి, మన సొంత ఊరికి మంచిపేరు తీసుకువస్తానని శివకోటి తెలిపారు. ఊరిలో ఉన్న పెద్దలందరి ఆశీస్సులు ఉన్నంతకాలం భారత జట్టు తరపున మంచి ప్రతిభ కనబరుస్తానని, ఇన్ని సంవత్సరాల పాటు నా వెన్నుతట్టి ప్రోత్సహించి సహాయం అందించిన ఊరిలోని దాతలకు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్, నందలూరు సబ్‌సెంటర్, స్థానికంగా ఉన్న సీనియర్ క్రికెట్ క్రీడాకారులందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని శివకోటి తెలిపారు.



6 కిలోలకు పైగా వచ్చిన తీపి గుమ్మడి కాయను చూపుతున్న రైతు

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ..



- గుమ్మడి సాగుతో లాభాలు
- ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి..రూ.లక్ష వరకు ఆదాయం
- తోటల వద్దే వ్యాపారుల కొనుగోలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

తంబళ్లపల్లె, ఆగస్టు 31: గతంలో సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టాలను మూటగట్టుకున్న రైతులు క్రమంగా వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అతి తక్కువ ఖర్చుతో చేతికొచ్చే పంటలైన గుమ్మడిని సాగు చేస్తూ ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. ఈ ఏడాది తంబళ్లపల్లె మండలంలోని రేణుమాకులపల్లె, మర్రిమాకులపల్లె, కన్నెమడుగు పంచాయతీల్లో సుమారు 25 మంది రైతులు 80 ఎకరాల్లో గుమ్మడి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పలుచోట్ల కోత దశలో ఉండగా మరికొన్ని చోట్ల పూత దశలో ఉంది. వ్యాపారస్తులు తోట వద్దకే వచ్చి కాయలను కొనుగోలు చేస్తూ బయటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఎకరాకు రూ.10 వేలు ఖర్చు

తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ పల్లెకుంట పల్లెకు చెందిన యువ రైతు ప్రభాకర్ సుమారు 2.5 ఎకరాలలో తీపి గుమ్మడి సాగు చేశాడు. గుమ్మడి విత్తనాలను కర్ణాటక రాష్ట్రం చింతామణి నుంచి తెప్పించాడు. ఎకరాకు 6 ప్యాకెట్లు చొప్పున అవసరమవుతాయని ఒక్కో ప్యాకెట్టు రూ.550 (200 గ్రాములు) ఉంటుంది. పొలంలో ఐదు అడుగులకు ఒక సాలు ఏర్పాటు చేసి ఒక అడుగు దూరంలో గుమ్మ డి విత్తనాలను నాటుకోవాలి. విత్తనం నాటిన పదిహేను రోజులకు మొక్క సత్తువ కోసం మొదళ్లలో యూరియా, డీఏపీ వేశాడు. అనంతరం సాళ్ల మధ్యలో గడ్డి మొలవకుండా రోటోవేటర్ ఉపయోగించాడు. భూమిలో ఉన్న తేమను బట్టి వారానికి రెండుసార్లు డ్రిప్పు ద్వారా నీరు అందివ్వాలి. ఒక నెలకంతా తీగ జాతికి చెందిన గుమ్మడి పొలం మొత్తం అల్లుకుపోతుంది. దీంతో మధ్యలో కలుపు బెడద పెద్దగా ఉండదు. తెగుళ్లు కూడా ఎక్కువగా ఆశించవు. అయితే, పూతకు మాత్రం తెగుళ్లు సోకకుండా మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. విత్తనం నాటడం మొదలు పంట కోసుకునే వరకు తక్కువ మంది కూలీలు సరిపోతారు. నాటిన మూడు నెలలకు సరిగ్గా పంట కోతకు వస్తుంది. ఎకరాకు విత్తనం నాటడం, ఎరువుల దగ్గర నుంచి పంట కోసే కూలీల వరకు సరాసరిగా రూ.10 వేల నుంచి రూ.12 వేలకు మించి కాదు.

ఎకరాకు సరాసరి 10 టన్నుల దిగుబడి

తీపి గుమ్మడి కాయలు భూమి స్వభావం, సత్తువ, వాతావరణ అనుకూలతలను బట్టి ఎకరాకు 7 నుంచి 13 టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. ఒక్కో గుమ్మడి కాయ కనీసం 2 కిలోల నుంచి 7 కిలోలకు పైగా పెరుగుతుంది. కాయలు త్వరగా పాడవ్వవు కాబట్టి పంట దిగుబడి వచ్చిన తర్వాత పదిహేను నుంచి ఇరవై రోజుల వ్యవధిలో మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నపుడు చూసి కోసుకోవచ్చు. పంట మొత్తం ఒకేసారి కటింగ్ చేయాల్సి ఉంటుంది.

మార్కెట్లో టన్ను రూ.6 వేలు

నెల క్రితం తీపి గుమ్మడి ధర మార్కెట్లో టన్ను రూ.12 వేలు వరకు ఉండేది. ఇప్పుడు టన్ను రూ.6 వేలు వరకు పలుకుతోంది. ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో గుమ్మడి దిగుబడి వస్తోంది. ఆ ప్రభావం కొంత మన ప్రాంతంలో పడటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే ధరలు ఎంత తక్కువన్నా టన్ను రూ.3 వేలు పోయినా రైతు పెట్టుబడికి ఢోకా ఉండదు.

తంబళ్లపల్లె నుంచి కలకత్తాకు ఎగుమతి

ఇక్కడ పండిన గుమ్మడి కాయలు కలకత్తా, ఒరిస్సాలతో పాటు ఉత్తరప్రదేశ్‌కు ఎగుమతి అవుతున్నాయి. వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి రేటు కుదుర్చుకుని పంటను కోసుకుని వెళుతున్నారు. దీంతో రైతుకు మార్కెటింగ్ ఇబ్బంది లేదు. వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల సీజన్‌లో గుమ్మడికాయలకు డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని జూన్, జూలై నెలల్లో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. తీపి గుమ్మడిని ఎక్కువగా స్వీట్లు, హల్వా తయారీతో పాటు మెడిసిన్‌లలో ఉపయోగిస్తారు. దీంతో బయటి రాష్ట్రాల్లో గుమ్మడికి ఎక్కువ డిమాండ్ ఉంది.

గుమ్మడి కాయలను లారీలకు లోడింగ్ చేస్తున్న కూలీలు



ఐదేళ్లుగా సాగు చేస్తున్నా..

రైతుమిత్రలు ఇచ్చిన సూచనతో ఐదేళ్లుగా గుమ్మడిని సాగు చేస్తున్నా. రెండున్నర ఎకరాలకు కలిపి 31 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.6 వేలు ధర పలికింది. ఈ లెక్కన 31 టన్నులకు ఇంచుమించు రూ.1.80 లక్షల వరకు వచ్చింది. రెండున్నర ఎకరాలకు రూ.30 వేలు పెట్టుబడి పోగా రూ.1.50 వరకు ఆదాయం వచ్చింది. ధర హెచ్చు తగ్గులున్నా ఆదాయం తప్ప నష్టం వచ్చింది లేదు. రైతులు కూడా తక్కువ ఖర్చు, శ్రమతో సాగయ్యే గుమ్మడి సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చు. ప్రభుత్వం కూడా ఇటువంటి పంటలపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేపట్టే విధంగా ప్రోత్సహించాలి. రైతులకు రాయితీపై డ్రిప్పులు, ఎరువులు అందించాలి.

\- ప్రభాకర్, రైతు పల్లికుంటపల్లె

ముురుగు తొలిగేనా..!

- నిధులు ఉన్నా.. ముందుకు సాగని పనులు
- కాలువల్లో పూడికతీత పనులకు టెండర్లు పూర్తి
- వర్క్ ఆర్డర్లు జారీ చేసిన అధికారులు
- పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- అధిక లెస్‌లకు టెండర్లు వేయడమే కారణమా!


ప్రొద్దుటూరు, ఆగస్టు 31: అసలే వర్షాకాలం.. మురుగు కాలువల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండి.. మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి.. ఈ దుస్థితిని ముందే పసిగట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. మురుగు కాలువల్లో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేసి.. ఏకంగా బ్యాంకు ఖాతాలో జమ చేసి.. తక్షణం పనులు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచి.. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు వర్క్ఆర్డర్లు జారీ చేశారు. అయితే దాదాపు 20 రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీనికి కారణం కాంట్రాక్టర్లు అధికశాతం లెస్‌కు టెండర్లు వేయడమే అని తెలుస్తోంది. దీంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పూడికతీత పనులకు ఆటంకం కలుగుతోంది. దీనిపై మున్సిపల్ పాలకమండలి, ఎమ్మెల్యే, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే పనులు ముందుకు సాగుతాయి. లేదంటే టెండర్లు జరిగినా.. పనులు జరగక నిధులు మురుగుతుంటాయి.


కోనేటి కాల్వ వీధిలో పూడిక తీయక పేరుకుపోయిన చెత్తాచెదారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపాలిటీల్లో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల నిధులు జూలై 24న విడుదల చేశారు. ఏకంగా బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేశారు. యుద్ధప్రాతిపదికన రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సి పాలిటీకి సంబంధించి కాలువల్లో పూడికతీత పనులకు రూ.1.21 కోట్లు నిధులు విడుదల చేసి.. బ్యాంకు ఖాతాలో జమ చేశారు. జూలై 31న ఐదు ప్రధాన మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్ట డానికి అంచనాలు రూపొందించి కౌన్సిల్‌లో టెండర్లకు ముందస్తు ఆమోదం తీసుకున్నారు. ఆగస్టు 1న టెండర్లు పిలిచి.. 6న ఖరారు చేశారు. పట్టణంలోని ప్రధాన కాలువ మడూరు స్ట్రామ్ వాటర్‌డ్రైన్ దొరసానిపల్లె జంబులమ్మ గుడి వద్ద నుంచి వాజ్‌పేయినగర్ వరకు పూడికతీత చేపట్టడానికి రూ.30.47లక్షలతో టెండర్ పిలువగా 15.99 శాతం లెస్‌తో ఎద్దుల కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. ప్రొద్దుటూరు చానల్-1 విజయనగరం వీధి జీవన జ్యోతి స్కూలు నుంచి శ్రీనివాసనగర్‌లోని బాలాజీ గ్యాస్ దగ్గర వరకు రూ.8.73లక్షలతో టెండరు పిలువగా 10.99 శాతం లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరు దక్కించుకుంది. ప్రొద్దుటూరు ఛానల్-2 దొరసానిపల్లె స్టార్టింగ్ పాయింట్ దగ్గర నుంచి శ్రీనివాసనగర్ డిస్పోజల్ పాయింట్ వరకు రూ.17.80 లక్షలతో టెండరు పిలువగా 15 శాతం లెస్‌తో ఎద్దుల కన్‌స్ట్రక్షన్ వారు టెండరు దక్కించుకున్నారు. కొత్తపల్లె ఛానల్ రామేశ్వరం నుంచి సిసీహబ్ వరకు రూ.14.32 లక్షలతో టెండరు పిలువగా.. 11.99 శాతం లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ టెంటరు దక్కించు కుంది. దొరసానిపల్లె ఛానల్ ఆర్ట్స్ కాలేజీ రిజర్వాయర్ వద్ద నుంచి గాంధీరోడ్డువరకు రూ.14.39 లక్షలతో టెంటర్ పిలువగా 11.99 లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ పని దక్కించుకుంది. దీనికితోడు మిషన్ ద్వారా కాలువల్లో పూడిక తీయలేని చోట మ్యానువల్‌గా పనులు చేసేందుకు మరో రూ.20 లక్షల అంచనాతో పనులు ఆమోదం తీసుకు న్నారు. ఈపూడికతీత పనులు చేపట్టాలని ఆగస్టు 6న మున్సిపల్ అధికారులు వర్క్ఆర్డర్ జారీ చేశారు. కానీ ఆగస్టు 25 తేదీ వచ్చినప్పటికీ కాంట్రా క్టర్లు పని చేయడానికి అగ్రిమెంటు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. అగ్రిమెంటు చేసుకుని పని మొదలు పెట్టాలని మున్సిపల్ కమి షనర్ నోటీసులు సైతం జారీ చేసినా కాంట్రాక్టర్లు స్పందించలేదు.

లెస్‌కు టెండర్లు వేయడమే కారణమా..

కాలువల్లో పూడికతీత పనులు రిస్క్‌తీసుకుని చేసే పనులు కావడం తో టెండర్లు తగిన రేట్లకు వేసుకుంటే గిట్టుబాటు అవుతుంది. కానీ కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు లెస్‌కు వేసి.. పనులు చేయకుండా కాలం వృథా చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు, పాలక మండలి, ఎమ్మెల్యే సమన్వయంతో టెండర్ ప్రక్రియపై దృష్టి పెట్టి వుంటే.. ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని పలువురు విమర్శిస్తున్నారు.


మడూరు కాలువలో నిండుకున్న వ్యర్థాలు

పూడికతీత పనులు చేపడతాం

కాంట్రాక్టర్లకు అగ్రిమెంటు చేసుకుని పూడికతీత పనులు మొదలు పెట్టాలని నోటీసులు సైతం జారీ చేశాం. నోటీసులకు ఇంకా స్పందించలేదు. ఎస్ఆర్ కాంట్రాక్టర్ మాత్రం అగ్రిమెంటుకు డబ్బులు కట్టాడు. ఎద్దుల కన్‌స్ట్రక్షన్ మాత్రం ఇంకా రాలేదు. కాంట్రాక్టర్ ముందుకు రాకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

-జి.రఘునాథరెడ్డి. మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూర్లు.

ఆరోగ్యమే మహాభాగ్యం : జిల్లా ప్రధాన జడ్జి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, ఆగస్టు 31: ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఈ నానుడిని గుర్తించుకుని ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రధా న జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయుష్ శాఖ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈమేరకు జిల్లా కోర్టులో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు, కక్షిదారులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం సంతోషకరమన్నారు. అనంతరం జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవితో పాటు పలువురు జడ్జిలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమ్మద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పాల్గొన్నారు.

రూ.1.7 కోట్ల వార్షిక వేతనంతో అమేజాన్‌లో కొలువు... అమృతవల్లి ప్రతిభ



కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31: కడప నగరానికి చెందిన ఎర్రనాగుల అమృతవల్లి అమెరికాలో ఏడాదికి రూ.కోటి 70లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి శభాష్ అనిపించుకున్నారు. అమృతవల్లి ఫ్యాన్సీ స్టోరు అధినేత ఎర్రనాగుల ప్రకాశ్‌బాబు-సరస్వతీ దంపతుల కుమార్తె అమృతవల్లి విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తరువాత జేఈఈ పరీక్షలో ప్రతిభ చూపి దుర్గాపూర్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆప్ టించర్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికై 14 నెలల పాటు పనిచేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి యూనివర్శిటీ ఆఫ్ ఫ్లోరిడాలో కంప్యూటరు సైన్స్ బ్రాంచ్‌లో ఎంఎస్ పూర్తి చేశారు. ఎంఎస్ డిగ్రీ తీసుకున్న నెల రోజులలోపే వాషింగ్టన్‌లోని కియాటెల్‌లో గల అమేజాన్ కేంద్ర కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంటు ఇంజనీరు-1గా 2,02,200 యూఎస్ డాలర్ల వార్షిక వేతనం (మన కరెన్సీలో ఏడాదికి 1.70 కోట్లు)తో నియమితులయ్యారు. అమృతవల్లికి అమెరికాలో ఉన్నత ఉద్యోగం లభించడం పట్ల చిన్నతనంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలకు ఆర్థిక సాయం


అర్థిక సాయం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్) ఆగస్టు 31: రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురు మహిళలకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం సాయంత్రం ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 23న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైల్వేకోడూరు వచ్చిన ప్పుడు ఆ ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు తమ ఆరోగ్య సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. రైల్వేకో డూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాయచో టికి వచ్చి కలెక్టర్‌కు వారి వినతిపత్రాలను అందజేయడంతో కోడూరు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి మనుమరాలికి రూ.50వేలు, ఓబులవారిపల్లికి చెందిన కల్పనకు రూ.20వేలు, చిట్వేలికి చెందిన బొంతల కుమారికి రూ.20 వేల చెక్కులు అందజేశారు.

ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



చెన్నూరు, ఆగస్టు 31: ఇంట్లో వారు ఆదరించలేదని.. అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకోబోయిన పశువైద్యశాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని కాపాడి బంధువులకు అప్పగించిన సంఘటన శనివారం చెన్నూరులో జరిగింది. కడప ప్రకాశ్‌నగర్‌కు చెందిన మండ్ల సంటెన్న (72) పశువైద్య శాఖ లో ఏఏవోగా పని చేస్తూ 12 ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. ఈయన గత కొంతకాలంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పట్టించుకోలేదని.. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని ఓ ఆటోలో చెన్నూరు సమీపంలోని కొండపేట వంతెనపైకి శనివారం మధ్యాహ్నం చేరుకున్నాడు. అతని ప్రవర్తన గమనించిన ఆటో డ్రైవరు దారిలో చెన్నూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఏఎస్ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరాజు, శివారెడ్డిలు అక్కడకు చేరుకుని.. వంతెన పైనుంచి దూకేందుకు యత్నించిన సంటెన్నను కాపాడి.. అక్కడే కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 31: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు వద్ద ఈ నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బింగి నరసింహులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు. ఏటూరు గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంలో వెలుతుండగా తాళ్లప్రొద్దుటూరు వద్ద వెనుక నుంచి బైక్ వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

యూసీఐఎల్ మైన్‌లో ప్రమాదం.. ఒకరికి గాయాలు



పులివెందుల, ఆగస్టు 31: యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మైనింగ్‌లో ప్రమా దం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన వెంకటమురళికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... శనివారం ఉదయం యూసీఐఎల్‌లోని మైనింగ్‌లో ఓ బండరాయి ఊడిపడి వెంకటమురళి అనే కార్మికుడిపై పడింది. దీంతో అతని కాలికి తీవ్ర గాయమైంది. తోటి కార్మికులు వెంటనే అంబులెన్స్ ద్వారా పులివెందుల ఆసుపత్రికి తరలించి.. వైద్యం అందించారు. యూసీఐఎల్ మైనింగ్‌లో ఇటీవల ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని కార్మికులు గగ్గోలుపెడుతున్నారు. ముున్ముందు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

4న టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

వేంపల్లె, ఆగస్టు 31: రాష్ట్ర స్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే కడప జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఈనెల 4వ తేదీన వేంపల్లె జడ్పీ హైస్కూల్ ఆటస్థలంలో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, ఆ పోటీల్లో పాల్గొనే జిల్లాజట్టును ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలోని సబ్‌జూనియర్ బాల బాలికలు ఈ ఎంపిక పోటీలకు హాజరుకావాలని ఆయన కోరారు.

హోరాహోరీగా టార్గెట్ బాల్ సౌత్‌జోన్ సీనియర్ పోటీలు


కేరళ, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 31: రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సౌత్‌జోన్ టార్గెట్ బాల్ సీనియర్ పోటీలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలు శనివారం టోర్నమెంట్ ఆర్గనైజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. లీగ్, నాకౌట్‌లలో జరగనున్న ఈ పోటీల్లో శనివారం మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్- తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు గెలుపొందింది. అలాగే పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్-తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు విజయం సాధించింది. అలాగే పురుషుల విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కూడా తమిళనాడు జట్టు విజయం సాధించినట్టు టోర్నమెట్ ఆర్గనైజర్ తెలియజేశా రు. అలాగే కేరళ- కర్ణాటక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ జట్టు గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ అరుణమ్మ, కడప జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సభ్యులు ప్రవీణ్‌కిరణ్, నిత్యప్రభాకర్, సుబ్బయ్య, బాలయ్య, అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సభ్యులు వీరాంజనేయులు, రెడ్డెయ్య, నరసరాజు, ఆంజనేయులు, గోపాల్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నిష్కళంక మాత మరియతల్లి


సందేశమిస్తున్న ఫాదర్ చిన్నప్ప


ప్రత్యేక అలంకారంలో మరియ తల్లి

కడప (కల్చరల్) ఆగస్టు 31: లోక రక్షకుడు ఉదయించుటకు వీలుగా ఆ భగవంతుడు నిష్కళంక మాత అయిన మరియ తల్లిని ఎంచుకుని అభయమిచ్చారని, అందుకే ఆ తల్లి ఆరోగ్యమాత అని అన్నమయ్య జిల్లా రామాపురం విచారణ గురువు ఫాదర్ చిన్నప్ప పేర్కొన్నారు. కడప నగర రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాలలో భాగంగా మూడవరోజైన శనివారం స్థానిక పుణ్యక్షేత్రంలో విచారణ గురువు ఫాదర్ బాల సుందరం దివ్వ బలిపూజను సమర్పించగా.. చిన్నప్ప మరియతల్లి సందేశాన్ని అందించారు. కాగా ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ప్రదర్శించారు. పుణ్యక్షేత్రం ఫాదర్లు, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి 20వేల క్యూసెక్కులు విడుదల



కొండాపురం, ఆగస్టు 31: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గురువారం మైలవరానికి 7,500 క్యూసెక్కులు విడుదల చేయగా.. దాన్ని 20వేల క్యూసెక్కులకు పెంచారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 880 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 9500 క్యూసెక్కులు, వర్షపు నీటి ద్వారా 1265 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 18.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

బతుకు బండలు

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు బండలపాలయ్యాయి. చదువుల కోసమని రేకుల షెడ్డులో తలదాచుకున్న విద్యార్థులు ఇద్దరైతే, అద్దెలు తక్కువని కొండ పక్కనే ఇంటిలో దిగినవారు కొందరు. సున్నపుబట్టీల సెంటర్‌లో శనివారం కొండరాళ్లు పడి మృతిచెందిన వారి కథలు చివరికి విషాదాంతమయ్యాయి.

- సున్నపుబట్టీల సెంటర్‌లో పడిన కొండరాళ్లు
- ఐదుగురు మృతి.. దొరకని మరో విద్యార్థి ఆచూకీ
- రెండు భవనాలు, రెండు షెడ్లు నేలమట్టం
- శిథిలాల కింద ఇరుక్కుపోయిన నివాసితులు
- భయం గుప్పెట్లో కొండప్రాంత వాసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): కొండరాళ్లు ఐదుగురి జీవితాలను చిదిమేశాయి. మరో నలుగురిని క్షతగాత్రులను చేశాయి. క్రీస్తురాజపురంలోని సున్నపుబట్టీల సెంటర్‌కు సమీపాన, 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఇళ్ల పక్కనే ఉన్న కొండరాళ్లు శనివారం ఉదయం ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ ఘటనలో రెండు భవనాలు, రెండు షెడ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. బ్యాంక్ ఉద్యోగి నవుదు మేఘన (25), సున్నపుబట్టీల సెంటర్‌కు చెందిన బోలెం లక్ష్మి (49), పశ్చిమ బెంగాల్‌లోని మగ్రాత్ ప్రాంతానికి చెందిన పి.లాల్ (38), జంపన అన్నపూర్ణ (55), కడప జిల్లాకు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి సంతోష్ (18) మృతిచెందగా, మరో విద్యార్థి యశ్వంత్ (18) ఆచూకీ ఇంకా తెలియలేదు. ఈ ఘటనలో మేఘన తండ్రి సత్యనారాయణ, తల్లి నాగమణి గాయాలతో బయటపడ్డారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మేఘనను బయటకుతీసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. అలాగే, అమ్మ కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన అలజంగి శాంతి, మొగల్రాజపురం నవోదయ రోడ్డుకు చెందిన కొప్పరవాలి స్వామి కూడా గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



కడప జిల్లాకు చెందిన విద్యార్థి సంతోష్ (18)

సహాయక చర్యలకు బ్రేక్

శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు కొనసాగాయి. కొండరాళ్లను పక్కకు తప్పించి శిథిలాలను తొలగిస్తున్నప్పుడు ఒక్కొక్కటిగా మృతదేహాలు బయటపడ్డాయి. వర్షం నిరంతరాయంగా కురవడంతో కొండను ఆనుకుని ఉన్న ప్రాంతంలో కదలికలు కనిపించాయి. దీంతో సహాయక చర్యలు ఆగాయి. మళ్లీ రాళ్లు జారిపడే సూచనలు కనిపించడంతో చుట్టుపక్కల భవనాల్లో ఉన్నవారిని బయటకు రప్పించారు. వర్షం తగ్గాక మళ్లీ సహాయక చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో ఫ్లడ్‌లైట్ల వెలుతులో ఎక్స్‌కవేటర్‌తో శిథిలాలను తొలగించారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు పరిశీలించారు.

అద్దెకు దిగిన మర్నాడే మృత్యువాత

కడప జిల్లా మైదుకూరుకు చెందిన కమ్మరి సంతోష్ ఆచారి (18), కృష్ణాజిల్లా కౌతవరం గ్రామానికి చెందిన యశ్వంత్ (18) నగరంలోని ప్రైవేట్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చేరారు. ఇద్దరూ కలిసి ఒకే గదిలో ఉండాలని నిర్ణయించుకున్నారు. సున్నపుబట్టీల ప్రాంతంలో 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో అద్దెకు దిగారు. కొద్దిరోజుల క్రితం వరకు హాస్టల్‌లో ఉన్నవారు శుక్రవారమే ఈ షెడ్డులోకి వచ్చారు. కొండరాళ్లు జారిపడటంతో యశ్వంత్, సంతోష్ శిథిలాల కింద ఇరుక్కుపోయారు. సంతోష్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీయగా, యశ్వంత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

ఆ కుటుంబం సురక్షితం

క్రీస్తురాజపురానికి చెందిన కాకుమాని పెద వెంకటేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండకు చెంతనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి రెండు పోర్షన్ల భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ఒక పోర్షన్‌లో ఉన్న కుటుంబం నెలక్రితం గుంటూరుకు వెళ్లింది. దీంతో ఈ కుటుంబం సజీవంగా మిగిలింది. భవనం మొత్తం నేలమట్టం కావడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి ధ్వంసమైంది. కుటుంబం మాత్రం ఇంట్లో లేకపోవడంతో మృత్యువు నుంచి బయటపడింది. పెద వెంకటేశ్వరావు ఏడాది క్రితమే ఈ ఇంటిని ఆధునికీకరించారు.


ఊటుకూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


రైల్వే కోడూరు: దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్


వీరబల్లి: పింఛన్లను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

ముఖ్యమంత్రి నిర్ణయం చరిత్రాత్మకం

- 31నే ముమ్మరంగా పింఛన్ల పంపిణీ
- కదలివచ్చిన కూటమి నేతలు
- వృద్ధుల కళ్లలో ఆనందం చూసేందుకే.. ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాజంపేట, ఆగస్టు 31: సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు శనివారం ఉదయం ఊటుకూరు పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేశారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దయార్ద్ర హృదయానికి నిలువెత్తు నిదర్శనం ఈ పింఛన్ల పంపిణీ అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శివప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాణి, టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యం నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్‌రాజు, ఊటుకూరు నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, కర్నాటం చెంగల్‌రాయుడు, పెంచల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని బోయపాలెం, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మల్లెల సురేఖ, మేకల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. సాతపల్లె గ్రామంలో టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా పింఛన్ల పంపిణీ చేశారు. దనాసపల్లె, అహ్మద్‌నగర్, వైబీఎన్‌పల్లె ప్రాంతాల్లో బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు తదితరుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

నందలూరు: స్థానిక నాయకులు ప్రభుత్వ అధికారులతో కలిసి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో సౌభాగ్యమ్మ, ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ కోఆప్షన్‌మెంబర్ మున్వర్‌బాషా, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, సాయినాథ్, గంగనపల్లి శ్రీను, గంగాధర్, మహబూబ్‌బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): వృద్ధుల కళ్లల్లో ఆనందం చూడడం చంద్రబాబు లక్ష్యం అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు ముందు పింఛన్ పంపిణీ చేయడం నిజాయితీ పాలనకు నిదర్శనం అని కొనియాడారు. శనివారం పట్టణంలోని రెండో వార్డులో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లి: పెన్షన్ పంపిణీని ఆగస్టు 31వ తేదీనే చేయడం చరిత్రాత్మక నిర్ణయం అని కూటమి నేతలు తెలిపారు. మండల వ్యాప్తంగా వందలాది మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 14 గ్రామ పంచాయతీల్లో అన్ని గ్రామాలలో అధికారులు, స్థానిక కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాలివీడు: నెల పూర్తి కాకముందే సామాజిక పింఛన్లను పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే క్రమం తప్పకుండా 1వ తేదీన సామాజిక పింఛన్లను అందజేస్తున్నారని, మండల వ్యాప్తంగా 98 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. .

సంబేపల్లె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపటినట్లు ఎంపీడీవో సునీల్‌కుమార్ తెలిపారు. 96.61 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. సోమవారం మిగిలిన వారికి పంపిణీ చేస్తామన్నారు. పింఛన్లపై సమస్యలు ఏమన్నా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

పెనగలూరు: నల్లపురెడ్డిపల్లెలో ఉపసర్పంచ్ లేబాక శ్రీనివాసులరెడ్డి నాయకత్వంలో ఉదయం 10 గంటలకే పింఛన్ల పంపిణీ వందశాతం పూర్తి చేశారు. వార్డుమెంబరు లేబాక రెడ్డయ్య, ఊటుకూరు పోలిరెడ్డి శివ తదితరులు ఉన్నారు. మండలంలోని నారాయణనెల్లూరు, కోమంతరాజపురం, సింగారెడ్డిపల్లెల్లో ముక్కా సాయివికాస్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో వరప్రసాద్‌తో అభివృద్ధి పనులపై చర్చించారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడులో సర్పంచ్ తనయుడు గద్దె పెంచల ఆధ్వర్యంలో వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేశా. ఈ సందర్భంగా టీడీపీ యువ నేత ముక్కా సాయివికాస్‌రెడ్డి, నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీంద్ర నాయుడు, మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, బొమ్మలరాజు పిచ్చిరాజు, కటికం సునీత, నాగరాజు, లో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను సొమ్ము పోయిందని ఫిర్యాదు

ఒంటిమిట్ట: మండలంలోని పెన్నపేరూరు పంచాయతీలో పింఛను పంపిణీ విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి పింఛను సొమ్ము కనపడలేదని తెలపడంతో గందరగోళం నెలకొంది. తన ద్విచక్ర వాహనంలో పెట్టిన రూ. 1.5 లక్షల మొత్తం ఎవరో తీసుకున్నారంటూ ఎస్ఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంపీడీవో రెడ్డిని వివరణ కోరగా డబ్బు కనపడని మాట వాస్తవమేనని.. మధ్యాహ్నం ఆ డబ్బు దొరకడంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మండలంలో పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

వీరబల్లి: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక నేత తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన అల్పాహార విందును స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన సమాధానమిస్తూ సమస్య పరిష్కారానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాయచోటి కడప మార్గంలోని గువ్వలచెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అందులోనే కొంత భాగం కేటాయిస్తే శ్రీశైలం నుంచి రాయచోటి, మదనపల్లె వరకు ప్రతి చెరువులో నీరు నింపే అవకాశం ఏర్పడుతుందన్నారు. అందుకు కూటమి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందన్నారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను మనం సక్రమంగా ఉపయోగించుకుంటే సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుండుపల్లెలో ఓ మోస్తరు వర్షం

సుండుపల్లి, ఆగస్టు 3: మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారు జామున సుండుపల్లి పరిసర ప్రాంతాల్లో 48.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పింఛా ప్రాజెక్టు సమీపంలో 14.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తెలిపారు. ఈ వర్షంతో వేరుశనగ, పండ్ల తోటలకు కాస్త ఊరట లభించిందని రైతులు చెబుతున్నారు.

కోదండ రామాలయంలో పూజలు

వీరబల్లి, ఆగస్టు 31: మండల పరిధిలోని మట్లి పంచాయతీ యల్లంపల్లి సమీపంలో మాండవ్యనది ఒడ్డున ఉన్న కోదండ రామాలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ఆలయ ధర్మకర్త పురుషోత్తంనాయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై 4న విచారణ

సుండుపల్లి, ఆగస్టు 31: మండల అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టరుకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఈనెల 4న ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణకు రానున్నారు. 2023-24లో 15వ ఆర్థిక సంఘం కింద 5 పనులకు రూ.11,14,470 లు , ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి నేటి వరకు 14 పనులకు గాను రూ.4,96,694 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. మండల సమావేశంలో పనులు ఆమోదించకుండా, అసలు పనులే చేయకుండానే నిధులు ఎలా డ్రా చేశారన్న విమర్శలు వినిపిస్తునాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం అయినట్లు కూటమి నేతలు విమర్శిస్తున్నారు. మండల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన నిధులు పక్కదారి పట్టినట్లు జోరుగా ప్రచా రం జరుగుతోంది. ఈ విషయమై ఎంపీడీవో రామచంద్రను వివరణ కోరగా ఫిర్యాదుపై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారులు విచారణ చేయనున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, ఆగస్టు 31: రాజీమార్గం ద్వారా అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి సూచించారు. శనివారం ఆయన స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలన్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయచోటి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫాసుల్తాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద, న్యాయవాదులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, టీ. ఈశ్వర్, పీ. రెడ్డెయ్య, అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐలు మోహన్‌నాయక్, నరసింహారెడ్డి , కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు దుర్ఘటనలో విద్యార్థినులకు న్యాయం చేయాలి

రాజంపేట, ఆగస్టు 30: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన దారుణంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుని బాధితులైన విద్యార్థినులకు న్యాయం చేయాలని రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్ డిమాండ్ చేశారు. శనివారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దారుణం సభ్య సమాజానికే తలవంపులు తెచ్చేవిధంగా ఉందన్నారు. ఇటీవల మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. రాజకీయ పార్టీలు తమ అంతర్గత విభేదాలను పక్కనబెట్టి అందరూ ఏకమై ఈ సంఘటనను ముక్తకంఠంతో ఖండించాలన్నారు. బీజేపీ దళిత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొఘరాజు రమణయ్య, రాష్ట్ర బీజేపీ మైనార్టీ ఉపాధ్యక్షులు షబ్బీర్‌అహ్మద్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, ఎద్దల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: బాలికల హాస్టల్‌లో హిడెన్ కెమెరాలను అమర్చిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ కళాశాలలో చదువు తున్న కొంత మంది విద్యార్థులు సీనియర్స్ సాయంతో గర్ల్స్ హాస్టల్ వాష్ రూమ్స్‌లో కెమెరాలను అమర్చిన విషయం వారం రోజుల క్రితమే విద్యార్థులు తెలియజేసినా యాజమాన్యం ఎలాంటి చర్య లు తీసుకోలేదన్నారు. కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయలేద న్నారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ పట్టణ నాయకులు అఫ్జల్‌బాషా, సమీర్, భరత్, సాగర్, సాజిద్, ప్రసాద్, కిరణ్, శివ, అమృత్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ బాత్‌రూంలో కెమెరాలు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏలూరు ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ సంఘటన సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.మండల అధ్యక్షుడు నవదీప్, ఉపాధ్యక్షుడు లోకేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నాయకులు వీరేష్, పవన్ తేజ్, మంజునాథ్ పాల్గొన్నారు.

వినాయక మండపాలకు కరెంటు చార్జీలు చెల్లించాలి

పెనగలూరు, ఆగస్టు 31 : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న మండపాలు, వేదికలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కరెంటు చార్జీలు చెల్లించాలని పెనగలూరు విద్యుత్ ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. మీసేవలో, గ్రామ సచివాలయాల్లో గాని 150 రూపాయలు దరఖాస్తు ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. 500 వాట్‌లకు వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాలన్నారు. 1000 వాట్‌లకు రూ. 2,250 ర, 1500 వాట్‌లకు రూ. 3 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ తర్వాత ప్రతి 500 వాట్‌లకు అదనంగా 750 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10 వేల వాట్‌లకు 15,750 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో విగ్రహాలు పెట్టుకునేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

దేవపట్ల ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో విచారణ

సంబేపల్లె, ఆగస్టు 31: దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో . కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో శనివారం డీఎంహెచ్‌వో కొండయ్య విచారణ చేశారు. శెట్టిపల్లిలో వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్న ఆదేశాలను సూపర్‌వైజర్లు పాటించలేదంటూ దేవపట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ నాయక్ ఫిర్యాదు చేయగా, వైద్యాధికారి వేధిస్తున్నాడంటూ హెల్త్ ఆఫీసర్లు ప్రతి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శనివారం పీహెచ్‌సీని సందర్శించి విచారణ చేశారు. మెడికల్ ఆఫీసర్ లేకపోవడంతో నలుగురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో పాటు వైద్య సిబ్బందిని విచారించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రామింగ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వ హిందూ సమ్మేళనం


మాట్లాడుతూన్న స్వామిని శ్రేయానంద

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 31: విశ్వహిందూ పరిషత్ స్థాపించి కృష్ణాష్టమికి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలోని బత్యాల భవన్‌లో కోడూరు, ఓబులవారిపల్లి మండలాల్లోని విశ్వహిందూ బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్మయారణ్యమ్ స్వామిని శ్రేయానంద, కాకర్ల రా ముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ సిద్ధాం తాలను నిబంధనలను వివరించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పోకల ప్రభాకర్, శ్రీని వాసుల నాయుడు, రెడ్డయ్య, పెంచల్ రెడ్డి, మల్లికార్జున, సోడిశెట్టి మణి, దరిశా వెంకటరెడ్డి, సాయం శ్రీధర్, జలదంకి సోమేశ్వర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు


ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న సీడీపీవో పద్మావతి

గాలివీడు, ఆగస్టు31: ఎగువగొట్టి వీడు పంచాయతీలో అంగన్వాడీ సెంటర్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి తెలిపారు. ఎగువగొట్టివీడు పంచాయతీలో అంగన్వాడీ సెంటర్లు కావాలని విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి జూలై 27న మండల టీడీపీ ఉపాధ్యక్షుడు శివప్పనాయుడు వినతి పత్రం అందజేశారు. ఈ విషయం పరిశీలించాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నాగన్నగుట్టపాలెం, ఎస్సీ కాలనీల్లో మినీ అంగన్వాడీ సెంటర్, అంగన్వాడీ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన జనాభా ఉందని గుర్తించామన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆమె తెలిపారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా వన మహోత్సవం


ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 31: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టినరోజు సందర్భంగా వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నాడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని రాజ్ రెసిడెన్సీలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎమ్మెల్యే చెన్నంశెట్టి రామచంద్రయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం,, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్, జనసేన సీనియర్ నాయకుడు అతికారి కృష్ణ, నాయ కురాలు ముక్కా వరలక్ష్మి, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

గాలివీడు, ఆగస్టు 31: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22న సీసీపల్లె పంచాయతీ కమలామర్రికి చెందిన బాలికకు తల్లిదండ్రులు వివాహం చేశారని తెలిపారు. ఈ విషయంపై గాలివీడు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో వరుడితో పాటు పెళ్లికి సహకరించిన వారి తల్లిదండ్రులు, బంధువులను అరెస్టు చేసినట్లు వివరించారు. బాలికలకు వివాహం చేసిన వారికి, వారికి సహకరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


హైమావతిని సన్మానిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బాలమురళీకృష్ణ

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 31: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని నెల్లూరు జిల్లా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బాల మురళీకృష్ణ, సీడీపీవో పద్మావతి అన్నారు. ఐసీడీఎస్ గ్రేడ్ వన్ సూపర్‌వైజరు ఎలంకూరి హైమావతి పదవీ విరమణ సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు హైమావతమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తగా అడుగుపెట్టిన ఆమె గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ పొందడం గొప్ప విషయమన్నారు సీడీపీవో పద్మావతి మాట్లా డుతూ హైమావతి 42 ఏళ్లు సేవలందించారని కొనియాడారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్, దేవదాసు, రాజేంద్రప్రసాదు జడ్పీ బాలికల పాఠశాల హెచ్ఎం రమణమ్మ, డాక్టర్ భరత్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాతమ్మ, దాద్‌బీ, అరుణకుమారి, సోనీపద్మరాణి, ఐసీడీఎస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గిరీష్‌రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణం

పెనగలూరు, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని పి.కొత్తపల్లెలో వెంగగురుస్వామి దేవాలయం నుంచి కోనేరు, కార్యసిద్ధి వినాయకాలయం వరకు తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 3 లక్షలతో సిమెంటు రోడ్డును నిర్మించారు. పి.కొత్తపల్లె గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నానికి రోడ్డు పనులు పూర్తి చేయించారు.

అన్నదానం పుణ్యకార్యం


అన్నదానం చేస్తున్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 31: అన్నదానం పుణ్య కార్యక్రమం అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా రాయచోటి పట్టణంలోని గాలివీడు మార్గంలో మాండవ్యనది ఒ డ్డున ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో డిష్ మెకానిక్ గురవయ్య అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాకా అన్నయ్య, టీడీపీ నాయకులు మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవికుమార్, మందపాటి కిశోర్, మాజీ కౌన్సిలర్ సహదేవ, బండకింద మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

గాలివీడు, ఆగస్టు 31: శ్రావణ శనివారం సందర్భంగా గండిమడుగులోని ఆంజనేయ స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. నూలివీడు పంచాయతీ దేవరకొండలో వెలసిన లక్ష్మీనరసింహ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయ పరిసర ప్రాంతంలో నూలివీడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికా రులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో నిర్వాహకులు అన్న దానం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్నకార్యకర్తలు

సిద్దవటం, ఆగస్టు 31 : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలని అంగన్వాడీ కార్యకర్త బి.సుబ్బలక్షుమ్మ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సిద్దవటం మండలంలోని మాధవరం-1 అంగన్వాడీ కేంద్రంలో శనివారం మొక్కలు నాటారు. అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకం పూజలు

సుండుపల్లి, ఆగస్టు 31: శని త్రయోదశి సందర్భంగా మండల కేంద్రానికి సమీపంలోని శివాలయంలో అభిషేకం, నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. తోజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహ స్థాపన

రామాపురం, ఆగస్టు 31: మండలంలోని గోపగుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. జీవిత బీమా సంస్థ విశ్రాంత ఉద్యోగి చెంద్రాయుడు విగ్రహాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎండీ ఇలియాస్ అహ్మద్ , ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు కలిసి విగ్రహ స్థాపనకు కృషి చేశారని ఎంఈవో రావకృష్ణుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బసయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

నందలూరు, ఆగస్టు 31 : సౌమ్యనాథ సేవాట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఎస్ఐ వెంకటేశ్వరును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్, ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, లంకయ్యగారి సుబ్బరామయ్య, చక్రాల సాయినాథ్, వంశీ, పెంచలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

తుడాలో ఇక ఐఏఎస్‌ల పాలన

వైసీపీ ప్రభుత్వంలో నాన్ ఐఏఎస్‌లతో ఇష్టారాజ్యం - కూటమి ప్రభుత్వంలో మళ్లీ పాత సంప్రదాయం

మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇక ఐఏఎస్‌ల పాలన కొనసాగనుంది. 2019వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారినే తుడా వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించేవారు. దీంతో పాలనలో పారదర్శకత ఉండేది. అభివృద్ధి పనుల్లో తుడా-మున్సిపల్ కార్పొరేషన్ మధ్య చక్కని సమన్వయం కనిపించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటికే ఉన్న ఐఏఎస్ అధికారి కొన్ని వివాదాస్పదమైన ఫైల్స్‌పై సంతకం చేసేందుకు నిరాకరించినట్టు వార్తలొచ్చాయి. దీంతో ఐఏఎస్ అధికారిని తప్పించి నాన్-ఐఏఎస్ అధికార్లను నియమిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో తుడా నిధుల గోల్‌మాల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తుడాలో నిర్వహించిన సమీక్షలో సిబ్బంది జీతాలకే ఏడాదికి రూ.15కోట్లు వెచ్చించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తుడా ప్రక్షాళనలో భాగంగా పాత సంప్రదాయాన్నే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ నారప రెడ్డి మౌర్యకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆమేరకు శనివారం ఆమె తుడా వీసీగా బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మౌర్య

తుడా అభివృద్ధికి కృషి చేస్తా : మౌర్య

తుడా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్ చైర్మన్ మౌర్య అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరపాలక సంస్థ, తుడాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈమెకు ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన వెంకట నారాయణతోపాటు నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

చుడా వీసీ విశ్వనాథ్ బదిలీ



చిత్తూరు, ఆగస్టు 31: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (చుడా) వైస్ చైర్మన్ విశ్వనాథ్ బదిలీ అయ్యారు. అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌గా వెళ్లారు. గతంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఈయన్ను రెండేళ్ల కిందట ప్రభుత్వం చుడా వైస్ చైర్మన్‌గా బదిలీ చేసింది. తాజాగా ఆయన్ను అనంతపురానికి బదిలీ చేయడంతో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 31: గ్రామాల్లో, పట్టణాల్లోని ముఖ్యమైన కూడళ్లలో, అపార్టుమెంటు వంటి ప్రదేశాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలతో శనివారం ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, పాత నేరస్థుల గురించి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం నేర ఛేదనలో, ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు అందించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



నేలపాలైన టమోటా పంట

సదుం, ఆగస్టు 31: మండల పరిధిలోని జోగివారిపల్లె అటవీ శివారు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటలను నాశనం చేశాయి. రైతులు ప్రకాష్ రెడ్డి, మదన, పురుషోత్తంరెడ్డిలకు చెందిన టమోటా, అనప, మినుము పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. చుట్టూ అటవీ ప్రాంతం కావడంతో మండలంలో తరచూ ఏనుగులు సంచరిస్తూ పంటలను నష్టపరుస్తున్నాయి. ఇనుప కంచెలు, కూసాలు ఏర్పాటు చేసినా లెక్క చేయడం లేదు. ఇప్పటికే ఏనుగుల దాడిలో ఇద్దరు రైతులు మృత్యువాతపడ్డారు. అదే సమయంలో విద్యుత్ షాక్‌తో రెండు ఏనుగులు చనిపోయాయి.పొలాలకు వెళ్లాలంటే భయమేస్తోందని, అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎట్టకేలకు కరుణించిన వరుణుడు

- 15 రోజుల తర్వాత కురిసిన వాన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 31: జిల్లావ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో 15 రోజుల విరామం తర్వాత వానలు మొదలయ్యాయి. గడచిన 24 గంటల్లో రామకుప్పం, శాంతిపురం మినహా మిగిలిన 30 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురంలో 21.8, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 2.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా చిత్తూరులో 18.2, పూతలపట్టులో 16.6, సదుంలో 16.4, పులిచెర్లలో 15.0, సోమలలో 14.8, నగరిలో 14.2, నింద్రలో 13.6, శ్రీరంగరాజపురంలో 13.6, తవణంపల్లెలో 12.2, గంగాధరనెల్లూరులో 12.0, కుప్పంలో 10.6, పెద్దపంజాణిలో 9.2, పలమనేరులో 9.2, గంగవరంలో 8.8, ఐరాలలో 8.2, పెనుమూరులో 8.0, చౌడేపల్లిలో 7.8, యాదమరిలో 7.4, బంగారుపాళ్యంలో 7.2, రొంపిచెర్లలో 6.6, పాలసముద్రంలో 5.6, పుంగనూరులో 5.4 మిమీ వర్షం కురిసింది. జిల్లాలో ఆగస్టు సాధారణ వర్షపాతం 122.1 మిమీ. శనివారం వరకు సాధారణానికి మించి 13 శాతం అదనంగా అనగా నమోదయ్యింది. 23 మండలాల్లో 20 శాతం అదనంగా వర్షం కురవగా, మిగిలిన తొమ్మిది మండలాల్లో అంతకు లోపు వర్షం కురిసింది. జూలైలో 13.6 మిమీ లోటు వర్షపాతం నమోదయ్యింది. ఆగస్టులో గడిచిన 15 రోజుల్లో సరైన వర్షపాతం లేనందున 15 మండలాల్లో 612 హెక్టార్ల వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు కలెక్టరుకు నివేదిక అందజేశారు.

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో శుక్ల యజుర్వేద పారాయణం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం టీటీడీ నిర్వహిస్తున్న చతుర్వేద పారాయణంలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో నాలుగో విడత శుక్ల యజుర్వేద పారాయణం ప్రారంభంకానుంది. చతుర్వేద పారాయణంలో భాగంగా జూలై1న ప్రారంభమైన సామవేద పారాయణ శనివారంతో ముగిసింది. ఈక్రమంలో ఆదివారం నుంచి శుక్ల యజుర్వేద పారాయణాన్ని మొదలుపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య వేదపండితులు శుక్ల యజుర్వేద పారాయణం చేయనున్నారు.

చెట్టు కూలి చెన్నై భక్తురాలికి గాయాలు



గాయపడిన ఉమామహేశ్వరి

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వృక్షం కూలి చెన్నైకి చెందిన ఉమామహేశ్వరి(44) అనే భక్తురాలు గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు వర్షపు చినుకులు పడుతున్న క్రమంలో ఏఎంసీ ప్రాంతంలోని 305వ కాటేజి వద్ద ఓ భారీ వృక్షం కూలిపోయింది. సమీపంలో కూర్చుని ఉన్న ఉమామహేశ్వరిపై చెట్టు కొమ్మలు పడటంతో తల, శరీరభాగాలపై గాయాలయ్యాయి. వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కూలిన వృక్షాన్ని తొలగించారు. చెట్ల కింద ఎవరూ కూర్చోవద్దని మైకుల ద్వారా సూచించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఆగస్టు 31: శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న కబడ్డీ జట్టు



శ్రీకాళహస్తి, ఆగస్టు 31: ముక్కంటి ఆలయాన్ని బెంగళూరు ప్రొ కబడ్డీ జట్టు సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

డ్రగ్స్ ఫ్రీ తిరుపతి

అవగాహన ర్యాలీలో గొంతెత్తిన విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: డ్రగ్స్ ఫ్రీ ఇండియా.. డ్రగ్స్ ఫ్రీ ఏపీ.. డ్రగ్స్ ఫ్రీ తిరుపతి.. డ్రగ్స్ ఫ్రీ యూనివర్సిటీ.. పేరుతో తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం - తిరుపతి పోలీసు శాఖ సంయుక్తంగా మత్తు పదార్థాల వ్యతిరేకంగా శనివారం ఎస్వీయూ పరిపాలనా భవనం నుంచి ఈ ర్యాలీ చేపట్టాయి. ఎన్టీఆర్ సర్కిల్ దాకా సాగిన ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు. ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లేకుంటే తీవ్ర శిక్షలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్‌పై 80999 99977 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ అనుమానిత ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్, నిఘా పెట్టామన్నారు. జిల్లాలో డ్రగ్స్‌ను సమూలంగా నివారించేందుకు పోలీసు శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయినా, డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, ప్రజల సహకారం అవసరమని అన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల మాయలో పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. భవిష్యత్తులోనూ పోలీసు శాఖతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 17న అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 17న అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ప్రతి ఏడాది భాద్రపద మాస శుక్ల చతుర్దశి పర్వదినాన అనంతపద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా భూవరాహస్వామి ఆలయం వద్దనున్న పుష్కరిణి చెంతకు వేంచేపు చేస్తారు. అక్కడ శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారుకు ప్రత్యేక అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. అలాగే సెప్టెంబరు 5వ తేదీన బలరామ, వరాహ జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. 18వ తేదీన పౌర్ణమి గరుడసేవ, 28న సర్వఏకాదశి పర్వదినాలు ఉన్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 65,080 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,394 మంది తలనీలాలు సమర్పించారు.

నేటి నుంచి పుష్కరిణిలోకి భక్తుల అనుమతి

తిరిగి ప్రారంభం కానున్న హారతి

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నెల ముందుగా నిర్వహించే మరమ్మతు పనులు పూర్తయి నూతన హంగులతో తీర్చిదిద్దబడిన శ్రీవారి పుష్కరిణిలోకి ఆదివారం నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిలో మరమ్మతు పనులు చేపట్టారు. పాత నీటిని తొలగించి అడుగు భాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచిని తొలగించడానికి దాదాపు వందమంది వాటర్‌వర్క్స్ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి స్వామి పుష్కరిణి శుద్ధి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. పుష్కరిణి మెట్లను బంగారు రంగుల అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటి లీటర్ల నీటితో స్వామి పుష్కరిణిని నింపి మరమ్మతులు పూర్తి చేశారు. ఈక్రమంలో ఆదివారం నుంచి పుష్కరిణిలోకి భక్తులను అనుమతించడంతో పాటు నెలరోజుల పాటు నిలిచిపోయిన పుష్కరిణి హారతి కూడా తిరిగి ప్రారంభం కానుంది.

జాషువా సాహిత్యంతో సామాజిక చైతన్యం



డాక్టర్ కస్తూరికి జ్ఞాపిక అందజేసున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: గుర్రం జాషువా సృజించిన సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గిస్తూ ఉందని పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కస్తూరి అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సాహితీ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక దురాచారాలను తన సాహిత్యం ద్వారా ఖండించిన ప్రత్యేకత జాషువాదన్నారు. వర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. సాహిత్యం పట్ల విద్యార్థుల్లో అవగాహనకు నిరంతరం ప్రయత్నిస్తున్నామన్నారు. సమితి సలహాదారు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల మరింత అభిరుచి కల్పించే లక్ష్యంతో అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసులో మరో ఇద్దరి అరెస్ట్



సీఐ అదుపులో నారాయణ, అరసు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసు వ్యవహారంలో తిరుమల పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఏపీ టూరిజం పేరిట ఉన్న నకిలీ దర్శన టికెట్లతో ఓ ముఠా సాగించిన అక్రమాలు ఆగస్టు20వ తేదీన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చెన్నైకి చెందిన ఎంపైర్ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై నకిలీ టికెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం కలకలం సృష్టించింది. ఈ కేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన పెరియస్వామిని విజిలెన్స్ ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసులో ఎవరెవరున్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా అనే అంశాలపై టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు.కేవీఎం సంస్థలో గతంలో పనిచేసిన నారాయణ పాత ఏపీ టూరిజం టికెట్లను ఎంపైర్ ట్రావెల్స్ ఉద్యోగి అరసుకు పంపగా రూ.15 వేలకు మోహన్‌రాజు అనే వ్యక్తికి విక్రయించి తిరుమలకు పంపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో నారాయణతో పాటు అరసును అరెస్ట్ చేసి వారి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభి షేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమ ర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీసీసీఎఫ్ ఆర్కే సుమన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

వర్షాల హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- ఆర్డీవోలతో జేసీ, డీఆర్వో వీడియో కాన్ఫరెన్స్
- ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఆగస్టు 31:పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ సంస్థ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించింది.దీంతో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. కంట్రోల్‌రూముల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ ఆర్డీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడెక్కడ భారీ వర్షాలు కురిశాయని అధికారులను ఆరా తీశారు. ఐతే సముద్రతీర ప్రాంతాల్లోకూడా వర్షా లు కురవలేదని ఆర్డీవోలు తెలియజేశారు.అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాల ని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణం స్పందించేలా సిద్ధంగా ఉండాల ని జేసీ ఆదేశించారు.తహసీల్దార్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లా కేంద్రానికి సమాచారం తెలియజేస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్‌చేసి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

కంట్రోల్‌రూమ్ నంబర్లు

తిరుపతి కలెక్టరేట్ 0877-2236007.
తిరుపతి ఆర్డీఓ కార్యాలయం : 8686966559
శ్రీకాళహస్తి : 9959322935
సూళ్లూరుపేట:8897265235
గూడూరు : 08624-252807

తిరుమలలో చిరుజల్లులు



తిరుమల మాడవీధుల్లో చిరుజల్లులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తిరుమల క్షేత్రంలోనూ కనిపించింది. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి.శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే దర్శనానికి వెళ్లడం, తిరిగి బయటకు రావడం కనిపిచింది. కాలినడక భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో చలి విపరీతంగా పెరిగింది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఘాట్‌రోడ్లలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు జల్లులతో ఇబ్బందిపడ్డారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మదనపల్లె మండలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ములకలచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా





బి.కొత్తకోటలో పింఛన్లు పంపిణీ దృశ్యం

మదనపల్లె టౌన్, ఆగస్టు 31: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు నెలలో పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఒక రోజు ముందుగానే పంపిణీ చేయడం పేదల ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనమన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె రూరల్, పట్టణం, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహించారు. శనివారం ఉదయమే మదనపల్లె మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ దిగువ కాశీరావుపేట గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే పోతబోలు, మదనపల్లె పట్టణంలోని రామిరెడ్డి లేఅవుట్, రాజానగర్, ముజీబ్‌నగర్, శివాజీనగర్, గొల్లపల్లె, రామ్‌నగర్, ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తోందన్నారు. దీని వలన ఒకే నెలలో రెండు సార్లు పింఛన్లను పంపిణీ చేసినట్లు అయ్యిందని గుర్తుచేశారు. దీంతో పాటు పట్టణంలోని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ తులసి, రామకృష్ణతో పాటు మండలంలోని టీడీపీ సర్పంచ్‌లు, పలు గ్రామాలు, మున్సిపల్ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మదనపల్లె మండలంలో 14,167 మంది లబ్ధిదారులకు గాను సాయంత్రం 6గంటలకు 96.56శాతం పింఛన్లను పంపిణీ చేయగా, రామసముద్రం మండలంలో కూడా 96.16 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. మదనపల్లె మున్సిపాలిటిలో 11,016 పింఛన్లకు గాను 97.53 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. మదనపల్లె ఎంపీడీవో భానుప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీలేరులో: మండలంలో టీడీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు శనివారం ఉదయమే పింఛన్ లబ్ధిదారులను నిద్ర లేపి వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ముందుగానే పింఛన్లు అందజేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అటు టీడీపీ నాయకులు, ఇటు ప్రభుత్వ యంత్రాంగం శనివారం సాయంత్రానికి 97 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తెలిపారు. పీలేరు మండలంలో 9835 పింఛన్లు ఉండగా 9525 పింఛన్లు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ఎక్కడిక్కడ టీడీపీ నాయకులు పాల్గొని విజయవంతం కావడానికి దోహదపడ్డారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని కొండయ్యగారిపల్లి నిమ్మనపల్లి అగ్రహారం, వెంగంవారిపల్లి, తవలం పంచాయతీలల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శనివారం పంపిణీ చేశారు. ఎన్నికల్లో వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన మొత్తాన్ని అధికారంలోకి రాగానే ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదే అని తెలిపారు. ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ శనివారానికి 98శాతం పింఛన్‌లను పంపిణీ చేశామని మిగిలిన వారికి 2వతేదీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, జనసేన మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పింఛన్‌లు పంపిణీ చేసి చరిత్ర సృష్టించదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలం లో శనివారం అధికారులు, కూటమి నేతలతో కలసి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో 6244 పింఛనుదారులు ఉండగా శనివారం సాయంత్రానికి 6153మందికి 98శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 5:30ల నుంచే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. 31వ తేదీ పింఛను అందుకోలేని వారికి ఆది, సోమవారాల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఇందులో భాగంగా గుర్రంకొండ పట్టణం, తరిగొండ, చెర్లోపల్లె, ఎల్లుట్ల, మర్రిపాడు తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలో మొత్తం 6093 మంది లబ్ధిదారులకు గానూ 5914 మందికి పింఛన్‌లను 97 శాతం అందజేసినట్లు ఎంపీడీవో వెంకటేశులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, చలమారెడ్డి, ఎల్లుట్ల మురళీ, రామయ్య, రంజిత్, శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ 97 శాతం జరిగినట్లు ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. అన్ని పంచాయితీ పరిధిలో ఉదయం నుంచే సచివాలయల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సొమ్మును అందజేశారు. మండలంలో 5529 మందికి గానూ 5366 మందికి పింఛన్‌లు అందించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఒకే నెలలో రెండు సార్లు పింఛన్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెలిగట్ల రమణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు కోసూరి రమేష్, చంద్రమౌళి, పీవీ నారాయణ, రెడ్డెప్ప, శంకర, కేకే నాయులు, రాజగోపాల్ పాల్గొన్నారు.

ములకలచెరువులో: ఒకే నెలలో రెండు సార్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. మండలంలోని పాత ములకలచెరువులో శనివారం లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లాగే దేవళచెరువులో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి ఫింఛన్లను పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఫింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పెద్దతిప్పసముద్రం మండలంలో శనివారం ఉదయం 5 గంటల నుంచి సచివాలయ సిబ్బందిచే ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కేఎస్ బాలాజీ పెర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు 1వ తేదీన ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బందిచే పంపిణీ చేశామన్నారు. ఒకే నెలలో రెండు సార్లు పింఛన్ లను పంపిణీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం పింఛన్ తీసుకోని లబ్ధిదారులకు సోమవారం పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: ఎన్టీయార్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం బి.కొత్తకోటలో పండుగలా జరిగింది. మండలవ్యాప్తంగా 288 క్లస్టర్లలో ఇన్‌చార్జి అధికారులు, టీడీపీ-జనసేన నాయకుల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. కాండ్లమడుగుక్రాస్ లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, బీరంగిలో మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, బి.కొత్తకోటలో కుడుం శ్రీనివాసులు, జనసేన నాయకుడు కిరణ్‌రాయల్‌లు పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే, ఒకేనెలలో రెండుసార్లు పింఛన్ ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబు దక్కించుకున్నారన్నారు. కాగా 7936 మందికి గాను 90శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శంకరయ్య తెలిపారు.

రామసముద్రంలో: పేదలకు సంక్షేమ పథకాలు అందించి వారి కన్నుల్లో ఆనందం చూడడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలో శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అరికెల, మాలేనత్తం, మినికి, చొక్కాండ్లపల్లె, ఊలపాడు, ఎలవానెల్లూరు, చెంబకూరు పంచాయతీలలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం కావడంతో పింఛన్‌దారులు, ఉద్యోగులు ఇబ్బంది పడకూడదని శనివారమే పింఛన్లు పంపిణీ చేసి ఒకనెలలో రెండు సార్లు పింఛన్ పంపిణీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ జడ్పీటీసీ శివశంకర్, హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు కృష్ణప్ప, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షుడు బాలాజి, అల్తాఫ్ ఒంటెల, బద్రినాథ్, పూలకుంట్ల శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, డీటీ శ్రీనివాసరావు, ఏపీవో గౌరీశంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించేదెప్పుడో..?



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె టౌన్, ఆగస్టు 31: జిల్లాలోనే అతి పెద్ద మున్సిపాలిటీ అయిన మదనపల్లె మున్సిపల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. 2.50లక్షల మంది జనాభా, అతి పెద్ద వార్షిక బడ్జెట్ ఉండే మదనపల్లె మున్సిపాలిటీలో నెల వారి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఏ నెలకు ఆ నెల ప్రజల సమస్యలు మున్సిపల్ సమావేశంలో చర్చించి, పరిష్కార చర్యలను ఆమోదించాల్సి ఉంది. కాని ఆగస్టు నెలలో నిర్వహించాల్సిన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఎందుకో అధికారులు, పాలకులు నిర్వహించలేదు. దీంతో అటు మున్సిపల్ కౌన్సిలర్లు, ఇటు పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. మదనపల్లె పట్టణంలో 35 మున్సిపల్ వార్డులు ఉండగా ప్రస్తుతం వర్షాకాలం నడుస్తుండటంతో కొన్ని వార్డులలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వందల సంఖ్యలో ప్రజలు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాల్సిన పాలకులు ప్రతి నెలా మున్సిపల్ సమావేశం నిర్వహించి ప్రజారోగ్య పరిరక్షణకు చర్చించి తీర్మాణాలు చేయాల్సి ఉంది. అంతే కాకుండా మదనపల్లె పట్టణం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాలు కురిస్తే చుట్టుపక్కల వర్షపు నీరంతా పట్టణంలోని ప్రధాన కాలువలు, బాహుదానది గుండా ప్రవహిస్తాయి. దీంతోపాటు పట్టణ నడిబొడ్డున ఉన్న కోమటివానిచెరువు నిండిపోయి, సరైన మొరవలు లేక వర్షపునీటితో కలసిన మురుగునీరు ఆర్టీసీ బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్ వద్ద మడుగులా నిల్వ అవుతున్నాయి. వాటిపై మున్సిపల్ సమావేశంలో చర్చించి పనులు చేపట్టాల్సి వుంది. అలాగే గత కౌన్సిల్ సమావేశంలో చర్చించి, తీర్మాణించిన ప్రకారం ఇప్పటి వరకు చేపట్టిన సీసీరోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనుల నాణ్యత, జనరల్ ఫండ్స్ ఖర్చు వివరాలపై చర్చించాలి. కానీ ఈనెల మాత్రం 31 రోజులు ముగిసినా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణపై ఎలాంటి సమాచారం అటు కౌన్సిలర్లకు గాని, ఇటు ప్రజాప్రతినిధులకు గాని తెలుపలేదు. దీంతో నెలలో చివరి రోజైన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారని ఎదురు చేసిన మున్సిపల్ కౌన్సిలర్లు విస్తుపోయారు. దీనిపై పట్టణ ప్రజలు కూడా పెదవి విరుస్తున్నారు.

వచ్చే వారంలో సమావేశం నిర్వహిస్తాం

మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ కోసం అనంతపురం, విజయవాడకు వెళ్లారు. అంతే కాకుండా శనివారం పట్టణంలో పింఛన్ల కార్యక్రమం నిర్వహించాల్సి రావడంతో మున్సిపల్ సమావేశం నిర్వహించలేకపోయాం. వచ్చే వారం లోపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తాం.

-ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెద్దమండ్యం, ఆగస్టు 31: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరైన సరే చర్యలు తప్పవని మదనపల్లి డీఎస్పీ డి. కొండయ్యనాయుడు హెచ్చరించారు. మండలంలో శనివారం ఆయన పర్యటించి పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు కేసుల రికార్డులను పరిశీలించారు. మండల సరిహద్దు గ్రామాలు, రాజకీయ, శాంతి భద్రతుల పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇసుక అక్రమ తరలింపులు, కోడిపందేలు, జూదాలు, అపరిచితుల సంచారం, నాటుసారా తయారీలు, అమ్మకాలు జరిపితే సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే వినాయక చవితి సందర్భంగా రహదారులపై చందాలను ఆపాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పని సరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రిలో పోలీసులు గస్తీ నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్‌లల్లో సిబ్బంది కొరత తీరుస్తామన్నారు.

మదనపల్లె డీఎస్పీని కలిసిన కూటమి నేతలు



తంబళ్లపల్లె, ఆగస్టు 31: తంబళ్లపల్లె కూటమి నేతలు మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడును మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. శనివారం టీడీపీ, జనసేన నాయకులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఆయన్ను కలసి మదనపల్లెకు డీఎస్పీగా వచ్చినందుకు అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, జయరాంరెడ్డి, రవిచంద్ర, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అధిక వర్షాలు కురుస్తుండటంతో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తాయనే కారణంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎక్కడైనా ప్రాణ నష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా చూసేందకుకు ముందస్తుగా భాదితులు కంట్రోల్ రూమ్‌కు పిర్యాదు చేయాలన్నారు. నిత్యం అధికారులు సమాయత్తంగా ఉంటారన్నారు. అంతే కాకుండా బాహుదానదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 8367321143, 9390967127, 7881023869,7075604806కు ఫోన్ చేయాలన్నారు.

ఆలయ ప్రవేశ నిరాకరణపై చర్యలు తీసుకోండి



సివిల్ రైట్స్ డేలో మాట్లాడుతున్న దళిత సంఘం నేతలు

పీలేరు, ఆగస్టు 31: గ్రామ సమీపంలోని రామాలయంలోకి తాము ప్రవేశించరాదని కొంత మంది ఆంక్షలు పెడుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలోని దళితవాడ గ్రామస్థులు అధికారులను కోరారు. దీంతో స్పందించిన అధికారులు 15 రోజుల్లోగా దళితులందరికీ ఆలయ ప్రవేశం కల్పించే విధంగా సామూహిక ఆలయ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని రెడ్డివారిపల్లె గ్రామస్థులను హెచ్చరించారు. రెడ్డివారిపల్లె గ్రామంలో శనివారం తహసీల్దారు భీమేశ్వర రావు నేతృత్వంలో నేషనల్ సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రెడ్డివారిపల్లె సమీపంలోని దళితవాడ గ్రామస్థులు రెడ్డివారిపల్లెలోని రామాలయంలోకి తమను కొంత మంది రానివ్వడం లేదని తహసీల్దారుకు తెలిపారు. దీంతో ఆయన అందుబాటులో ఉన్న కొంత మంది రెడ్డివారిపల్లె గ్రామస్థులను విచారించి ఆలయంలోకి అందరినీ రానివ్వాలని, వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళితవాడల్లో శాశ్వత శ్మశాన వాటికతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం లక్ష్మణ్ రెడ్డి, ఏఎస్ఐ హేమసుందర్, ఏఈ ఎతిరాజులు, ఆర్ఐ చాణక్య, దళిత సంఘ నేతలు పాలకుంట శ్రీనివాసులు, తుమ్మల ధరణీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

వాల్మీకిపురం, ఆగస్టు 31: క్రీడల పట్ల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం ఆర్ఎంఎం కళ్యాణ మండపంలో క్రీడాకారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె డివి జన్ అండర్ -14 క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించడం పట్ల ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. వాల్మీకిపురం క్రీడా మైదానం అభివృద్ధి, సీనియర్ క్రీడాకారులను గుర్తించి తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. చివరగా సీనియర్ క్రీడాకారులు విజయ్‌కు మార్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శ్రీధర్‌కుమార్, శ్రీనివా సులు, గిరి, సతీష్, మదనపల్లె డివిజన్ కోచ్ సునీల్‌కుమార్, గ్రౌండ్ ఇన్‌చార్జ్ షాహీద్, సీనియర్ క్రీడాకారులు భరత్, ఆసిఫ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయం



వాల్మీకిపురం, ఆగస్టు 31: వాల్మీకిపురం పట్టణంలోని తోట వీధికి చెందిన షేక్ ఇస్మాయిల్‌కు సహారా చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.25వేలు ఆర్థిక సహాయం అందించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచాన పడిన ఇస్మాయిల్ వైద్యానికి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు సహారా చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించగా స్పందించిన ట్రస్టు సభ్యులు దాత సాహాయంతో రూ.25వేలు అందజేశారు. ఇస్మాయిల్ కుటుంబీకులు ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు సాదిక్, సభ్యులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, ఆగస్టు 31: గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



వాల్మీకిపురం ధర్మపథంలో విశేష పూజలు అందుకుంటున్న శనేశ్వరస్వామి

వాల్మీకిపురం, ఆగస్టు 31: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరులోని ధర్మపథం సమూహాలయంలో శనివారం శ్రావణ శనిత్రయోదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. షిర్డీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా శనేశ్వర స్వామికి విశేష పూజలు, పాలు, పసుపు, కుంకుమ, చందనం, జలాభిషేకాలు జరిగాయి. అనంతరం మహా తైలాభిసేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలతో పూజలు జరగ్గా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో..

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 31 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం నవగ్రహ పూజ, శనైశ్వరునికి తైలాభిషేకం, నక్షత్ర శాంతిహోమం, పూర్ణాహుతి పూజలను నిర్వహించారు. ఆఖరి శ్రావణమాస శనివారం కావ డంతో అశేష భక్త జనసందోహంతో ఆలయం కిక్కిరిసింది. పూజ కార్యక్రమాలకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శనివార పూజలు

పెద్దమండ్యం, ఆగస్టు 31: పెద్దమండ్యం మండలంలో శ్రావణ మాసం చివరి శనివారం అంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమండ్యం, బిక్కావాండ్లపల్లి, పాపేపల్లి, ముసలికుంట, కలిచెర్ల, మందలవారిపల్లి, కోటకాడపల్లి, వెలిగల్లు, కొలిమికాడపల్లి, చెరువుకిందపల్లి తదితర గ్రామాలల్లోని ఆయాలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

గెవితిమ్మరాయస్వామి ఆలయంలో ..

రామసముద్రం, ఆగస్టు 31: మండలంలోని దిన్నిపల్లె సమీపంలో వెలసిన మహావిష్ణువు అవతార గెవితిమ్మరాయస్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం పూజలు శనివారంతో ముగిసాయి. ఈసందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురు అరెస్టు

పీలేరు, ఆగస్టు 31: పీలేరులో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. పీలేరు-మదనపల్లె మార్గంలోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద తనిఖీలు జరుపుతుండగా మదనపల్లె వైపు నుంచి పీలేరుకు వస్తున్న ఏపీ26 ఏఏ 0689 నెంబరు గల కారును వదిలి డ్రైవర్ పారిపోయాడన్నారు. తాము కారును తనిఖీ చేయగా అందులో మదనపల్లెకు చెందిన బి.గణేశ్ బాబు(23), గణేశ్ కుమార్(25), దేవేంద్ర(19)తో పాటు 23 కర్ణాటక మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. తాము వారిని విచారించగా కర్ణాటక మద్యాన్ని పీలేరులో విక్రయించేందుకు తెస్తున్నట్లు అంగీకరించారన్నారు. వారిని విచారించగా కారును వదిలి పారిపోయిన డ్రైవర్ నాగరాజుగా వెల్లడైందన్నారు. దీంతో తాము వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. వారిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన తనను, కానిస్టేబుల్ విజయ్ కుమార్, హోంగార్డు శివలను రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు అభినందించినట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు31: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, రోడ్డుప్రమాదాలను నివారించాలని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక మదనపల్లె యూత్ కరాటే క్లబ్‌అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఆర్ సురేష్ కరాటే స్కూల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను డీఎస్పీ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాంఘీక దురాచారాలను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసరావు

రామసముద్రం, ఆగస్టు 31: సమాజంలో సాంఘీక దురాచారాలను నిర్మూలించాలని డీటీ శ్రీనివాసరావు, ఈవో ఆర్‌డీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి నెలా రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే పౌర హక్కుల సమావేశం శని వారం మండలంలోని మూగవాడి గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను ఆలయ ప్రవేశానికి నిరాకరించడం, రెండుగ్లాసుల పద్ధతి వంటి సాంఘీక దూరాచారాలను ప్రోత్సహించరాదన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రఘురాం, ఆర్ఐ నాగరాజు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

9మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 31: మండలంలోని తరిగొండ బస్టాండు సమీపంలోని పొల్లాల్లో జూదం ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. జూదంపై సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 9 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుమ్మణంగుట్ట రంగురాళ్ల పై వీఆర్‌వో విచారణ

బి.కొత్తకోట, ఆగస్టు31: మండలంలోని తుమ్మణం గుట్టలో విలువైన రంగురాళ్లు ఉన్నాయంటూ గ్రామస్థులు ఎగబడటం పై స్థానిక వీఆర్‌వో సంధ్య శనివారం విచారణ చేశారు. పలువురు గ్రామస్థులు సేకరించిన రాళ్లను పరిశీలించి వారితో మాట్లాడారు. గుట్టలో ఈ రాళ్లు ఎవరు కనుగొన్నారని వాటికి విలువ ఉందని ఎవరు చెప్పారని అడిగి తెలుసుకున్నారు. వాటిని బయటి ప్రాంతాలకు టెస్టింగ్‌కు పంపారా? దీని వెనుక ఎవరి ప్రోత్సాహం ఉంది. అనే విషయాలపై ఆరా తీశారు. అధికారులు విచారణకు రావడంతో రాళ్లను సేకరించిన పలువురు వ్యక్తులు ముందుకు రాకుండా వెళ్లిపోయినట్లు సమాచారం.

కన్వర్షన్ లేకుండా భూమి అభివృద్ధి చేయవద్దు



భూ రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 31: మండలంలోని చిప్పిలి గ్రామంలో భూమిని కన్వర్షన్ చేయకుండా అభివృద్ధి చేయకుడదని రెవెన్యూ అధికారులు తెలిపారు. 32 మందికి కలిసి 22 ఎకరాల భూమి ఉందని, ఇందులో అన్‌లైన్ భూమికి సంబంధించి రికార్డులు వన్ బీ, పాస్ పుస్తకాలు, సబ్ డివిజన్ కాలేదన్నారు. భూమిలో కాంపౌండు, నాన్ అగ్రికల్చర్ కింద అభివృద్ధి చేయరాదన్నారు. సర్వే నిర్వహించి, సబ్ డివిజన్ చేసి, కన్వర్షన్ చేయించుకోవాలన్నారు. అంతవరకు భూమిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదని రైతులు వారి వారి రికార్డులు తెస్తే పరిశీలించి సర్వే నిర్వహిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో నారాయణ, సచివాలయ సర్వేయర్లు సురేష్, యశోదమ్మలు పాల్గొన్నారు. అనంతరం రైతులు బెంగుళూరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిలో వాహనాలు బారులు తీరాయి.

గురుకుల ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

బి.కొత్తకోట, ఆగస్టు31: బి.కొత్తకోట మండల పరిధిలోని చంద్రమాకులపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన నాగవేలు ను శనివారం పాఠశాల సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో రెడ్డిశేఖర్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ నాగవేలు తన 40ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎందరో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాను వినియోగించుకోండి

పీలేరు, ఆగస్టు 31: తపాలా జీవిత బీమా (పీఎల్ఐ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవా లని తపాలా శాఖ పీలే రు ఇన్‌స్పెక్టర్ వినోద్‌కు మార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీఎల్ఐతో పాటు తపాలా శాఖ అందిస్తు న్న ఇతర సేవలపై తపాలా సిబ్బంది శనివారం పీలేరు పట్టణంలోని పలు జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇందిరమ్మ కాలనీలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎల్ఐ పథకంలో 18 నుంచి 60 సంవత్సరాల వారు ఏడాదికి రూ.549 ప్రీమి యం చెల్లిస్తే రూ.10 లక్షలు, రూ.749 ప్రీమియం చెల్లిస్తే రూ.15 లక్షల ప్రమాద బీమా సదుపాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది హరీష్, సుబ్రహ్మణ్యం, చైతన్య, దేవ పాల్గొన్నారు.

హిల్స్‌లో కర్ణాటక పర్యాటకశాఖ అధికారి

బి.కొత్తకోట, ఆగస్టు31: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆదివారం కర్ణాటక రాష్ట్ర పర్యాటక శాఖ చీఫ్ సెక్రటరీ ఫహీమా పర్యటించారు. హిల్స్‌పై నున్న గాలిబండ, ఏరియల్ వ్యూపాయింట్, బోటింగ్, టూరిజం రెస్టారెంట్ తదితర ప్రదేశాలను తిలకించారు. హిల్స్‌పై ఆహ్లాదకర వాతావరణం చూసి ఆనందించారు.

మోడల్ స్కూల్లో ఎస్ఎంసీ ఎన్నిక

పెద్దమండ్యం, ఆగస్టు 31: పెద్దమండ్యం మోడల్ స్కూల్‌లో శనివారం స్కూల్ కమిటీ ఎన్నిక జరిగింది. అయితే ఒక వర్గానికి అనుకూలం గా ఎన్నికల నిర్వహణ అధికారులు వ్యవహరించారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. మోడల్ స్కూల్ కమిటీ రెండు సార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే శనివారం మూడవ సారి కోరం లేకపోయిన ఎన్నికలు నిర్వహించారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల అధికారులతో వాదనకు దిగారు. కాగా ఎన్నికలకు సంబంధించి కోరం ఉందని ఉపాధ్యాయులు చెప్పడంతోనే స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, పెద్దమండ్యం ఇన్‌చార్జ్ ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.